
గేయాలు వ్రాస్తుంటారు.

ఈ మధ్యనే ఆయన ఓ గొప్ప గేయ సంపుటిని వ్రాసి. దానిని ఆవిష్కరింప




చేయటానికి ఓ ప్రముఖ కవి అప్పలస్వామి గారిని ఆహ్వానించారు. అప్పలస్వామి గారు ఒప్పుకొన్నారు.

రెండు రోజుల తరువాత గ్రంథావిష్కరణోత్సవంకోసం టౌన్‌హాలు రంగురంగుల బల్బులతో, షామియానాలతో, మిరుమిట్లు గొలిపే కాంతులతో అలంకరింపబడింది. ఈ అలంకరణోత్సవానికి శ్రద్ధ తీసుకున్నది కంట్రాక్టరు జగ్గారావుగారు. తనకు కవిత్వం అంటే వల్లమాలిన పిచ్చి అని, తనింట్లో ఓ కవితల లైబ్రరీ ఉందని, దానిలో ఒక అర ప్రకాశంగారి కవితలతో అలంకరించినట్లు ప్రకాశంగారికి జగ్గారావు కంట్రాక్టరు తరచు చెప్పేవారు. కలెక్టరు గారు, ఎస్. పి. గారు, డి.ఎస్.పి.గారు, జిల్లా జడ్జీగార్లకు ఓ పెద్ద వరుస, క్లాస్ టూ క్లాస్ త్రీ, క్లాస్ ఫోర్.... ఇట్లా రకరకాల స్తోమతలనుబట్టి కుర్చీలు అమర్చారు. కవి అప్పలస్వామిగారు ఆ గ్రంథాన్ని ఓ శుభ ముహూర్తపు గడియలో ఆవిష్కరించి ఈ మాటలు అన్నారు. "మన ప్రముఖ రచయిత, ఆఫీసరు అయినటువంటి ప్రకాశంగారి రచనా ప్రతిభ ఈ సభయే చెబుతున్నది. ఆయన ప్రజాకవి...." ఈ విధంగా సాగిన ఆయన ఉపన్యాసానికి అడుగడుగునా చప్పట్లు మిన్ను ముట్టాయి. ఓ యిద్దరు, ముగ్గురు ప్రముఖులుకూడా ఉద్రేకపూరితంగా ప్రకాశంగారి కవితలను గురించి మాట్లాడారు.


ఆ తరువాత అనేక తన పుస్తకాలను అదే రీతిలో ప్రకాశంగారు ఆవిష్కరింప చేశారు.

కాలం గిర్రున తిరిగింది.

ఆ రెండవ సంవత్సరం ప్రకాశంగారు రిటైర్ అయ్యారు. ఆ తరువాత కొన్ని నెలలకు ఓ చిన్న పుస్తకం వ్రాసి ఆవిష్కరింపచేయాలని ఓ కవిగారిని పిలిచారు. ఆవిష్కరణోత్సవం అదే టౌన్‌హాలులో. కాని, ఈసారి కంట్రాక్టరు జగ్గారావు టౌన్‌హాల్‌ను రంగురంగుల బల్బులతో అలంకరించలేదు. అసలు జగ్గారావు ఆ సభకు రాలేదు.

వచ్చిన జనం ఇరవై మంది మాత్రమే. అప్పుడు అర్థమయింది ప్రకాశానికి తన కవిత్వం. ★

---




సెకెండు షో సినిమాచూసి రిక్షాలో యింటికి వస్తున్నారు యిద్దరు భార్యాభర్తలు. కొద్దిదూరం వచ్చేటప్పటికి రిక్షా పంక్చర్ అయింది. ఇంకా పోవలసిన దూరం చాలా వుంది. వేరే రిక్షా యేమైనా దొరుకుతుందేమోనని చూశారు కానీ లాభం లేకపోయింది. "సార్! మీ రిక్కడే వుండండి- ఆ దగ్గరలోనే సైకిల్‌షాపొకటి వుంది వాడిని లేపి పంక్చర్ వేయించుకొస్తాను." అని చెప్పి వెళ్ళిపోయాడు రిక్షావాడు.

చేసేదిలేక అక్కడే నిలబడిపోయారు భార్యాభర్తలిద్దరు. ఇంతలో భర్తకు "లఘుశంక" తీర్చుకోవలసిన అవసరం రావటంతో ప్రక్కకు వెళ్ళాడు. ఒంటరిగా నిలబడివున్న భార్య అటుపైపే వస్తున్న బీటు కానిస్టేబులు భీమారావు కంటబడింది. ఇదేదో 'ఆ' బాపతే అయ్యుంటుంది అనుకున్నాడు. తన రొట్టె విరిగి నేతిలో పడిందనుకున్నాడు. అసలు తనే నేతిలో పడ్డంత సంబరపడిపోయాడు కూడా. ఈ దెబ్బతో తనకు ప్రమోషన్ ఖాయమని నిశ్చయం చేసుకున్నాడు. ఆనందంతో చేతులూపుకుంటూ చేతిలో లాఠీ ఊపుకుంటూ ఆ యువతిని సమీపించి క్రాస్ ఎగ్జామిన్ చెయ్యటం మొదలుపెట్టాడు.

ఇంతలో భర్త రానే వచ్చాడు. వచ్చి సంగతి కనుక్కొని, "ఓర్నాయనా! మేమిద్దరంభార్యాభర్తలంరా!" అని సవినయంగా మనవి చేసుకున్నాడు. ఆ మాటలు మన భీమారావుకి ఏమాత్రం రుచించలేదు. "ఆ పప్పులు నా దగ్గరే ఉడకవ్. ఇలా అన్నవాళ్ళని నా సర్వీసులో ఎంతమందిని చూసుంటాను. ముందు స్టేషన్‌కు నడవండి. చెప్పుకోవలసిందేమున్నా ఉంటే అక్కడ చెప్పుకోండి!" అని ఉడుం పట్టు పట్టాడు.

ఇక చేసేదిలేక స్టేషనుకు వెళ్ళారు. స్టేషన్‌లో యస్. ఐ. గారికి తామిద్దరం భార్యాభర్తలమేనని మరొక్కసారి విన్నవించుకున్నాడు భర్త.

"మీరు భార్యాభర్తలేనని మాకేమిటి నమ్మకం. రుజువేమయినా వుంటే చూపించండి. వదిలేస్తాం" అన్నాడు యస్. ఐ.

"అర్ధరాత్రప్పుడు రుజువు కావాలంటే ఎలా? కావాలంటే రేపుదయం చూపిస్తాం" అన్నాడు భర్త.

"అయితే అప్పటివరకు స్టేషన్‌లోనే ఉండవలసివస్తుంది." అన్నాడు యస్.ఐ.

అప్పటివరకు మౌనంగా వింటున్న భార్య కోపంతో భర్తవైపు తిరిగి. "నేను చెప్తే విన్నారా. అసలు సెకెండ్ షోకి నేను రాను మొర్రో అని మొత్తుకుంటే నా మాట వినలేదు. ఇప్పుడు చూడండి ఏమైందో! రాత్రంతా పోలీస్ స్టేషన్‌లో ఉండాలంట హవ్వ!....ఎవరైనా వింటే ఇంకేమయినా వుందా? అంతా మీ తెలివి తక్కువ వల్లే జరిగింది. ఇంకేం చేస్తాం, అనుభవించండి. ఛీ.....ఛీ!!....ఇలాంటివి మా యింటా వంటా లేవు. ఏం చేస్తాం మిమ్మల్ని కట్టుకున్నందుకు తప్పదుమరి." అంటూ భద్రకాళిలా విరుచుకుపడింది.

మధ్యలో యస్. ఐ. అడ్డుపడి "అమ్మా! ఇక ఆపండి! ఈ మాత్రం రుజువు చాలు మీ యిద్దరూ భార్యాభర్తలే ననటానికి. ఇక మీరు నిక్షేపంగా యింటికి వెళ్ళవచ్చు," అని వాళ్ళిద్దరినీ పంపేశారు. ★

